ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన మెక్సికో బృందం


ప్రకృతి వ్యవసాయ రైతు చక్రపాణి పొలాన్ని పరిశీలిస్తున్న మెక్సికో బృందం


జీవ పదార్థాలను తయారు చేస్తున్న దృశ్యం

పెదవేగి: రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు చాలా స్ఫూర్తిగా ఉన్నాయని, మా దేశంలో కూడా రసాయన రహిత వ్యవసాయం అనుసరిస్తున్నా ఇక్కడ ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నామని, మా దేశంలో కూడా ఇలాంటి పద్ధతులు అవలంబిస్తామని మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా నేటివిటీ స్పష్టం చేశారు. తమ మూడు రోజుల పర్యటనలో భాగంగా మెక్సికో ప్రతినిధి బృందం గురువారం తొలుత పెదవేగి మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో చక్రపాణి అనే రైతు పొలం సందర్శించింది. గత 7 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తున్న చక్రపాణి తన 11 ఎకరాల విస్తీర్ణంలో పండిస్తున్న వక్క, మిరియాలు, ఆయిల్‌పామ్‌తో బిర్యానీ ఆకు, అల్లం, గిరిజన రకపు పసుపు, నల్ల పసుపు, దాల్చిన చెక్క తదితర పంటలను పరిశీలించి రైతు అనుసరిస్తున్న ప్రకతి వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు. చక్రపాణి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ తనపై ఉన్న విశ్వాసంతో వినియోగదారులు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు చర్యగా గ్రేడింగ్ చేసి మిరియాలు, పసుపు, కొబ్బరి నూనె విక్రయిస్తున్నట్లు రైతు తెలిపారు. కూరగాయలు వృథా కాకుండా మార్కెట్ లో డిమాండ్ లేని సమయంలో సోలార్ డ్రైయర్ సిస్టమ్ ద్వారా నిల్వ చేసి అమ్ముతున్నట్లు వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో హెక్టార్ కు రూ 5 లక్షల నికర ఆదాయం పొందుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సమావేశమైన రైతులను ఉద్దేశించి ఏరియా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రైతులకు అభినందనలు తెలిపారు. రైతుల అనుభవం తమకు ఎంతో ఉపయోగపడిందని అన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారులు అరుణ, స్మిత జాకోబ్, సురేష్, మధు ప్రీతి, సరోజ, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి లకుపతి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే అత్యాచారాలు

దెందులూరు: ఏలూరు జిల్లాలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఐసీడీఎస్ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల ఎయిమ్ ఫర్ సేవా హోమ్ నిర్వాహకులు అభం శుభం తెలియని చిన్నారులపై శారీరక, మానసిక వేధింపులకు గురి చేశారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్ విమర్శించారు. గురువారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ హోమ్‌కు అరకిలోమీటరు దూరంలో చైల్డ్‌వెల్ఫేర్, ఐసీడీఎస్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధిత చిన్నారులందరికీ ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఉచిత విద్య,వైద్యం, షరతులు లేకుండా వారందరికీ ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలతో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

22న క్విజ్ పోటీలు

నిడమర్రు: అడవికొలను గ్రామానికి చెందిన శ్రీ విష్ణుసాయి జ్ఞానజ్యోతి 26వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22న శ్రీభగవద్గీత క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్య నిర్వహణ అధ్యక్షులు చక్రవర్తుల సుబ్బారావు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆ రోజు సాయంత్రం 4 గంటకు గ్రామంలోని శ్రీకేశవస్వామి ఆలయం వద్దకు రావాలని కోరారు.

క్లుప్తంగా

విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ


విద్యార్థులకు బస్ పాస్‌లను అందజేస్తున్న దాత పేరిచర్ల రాంబాబు, ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: దాత పేరిచర్ల రాంబాబు సేవలు అభినందనీయమని నిడమర్రు ఎస్సై వీరప్రసాద్ అన్నారు. నిడమర్రు గాదిరాజు గోపాలకృష్ణంరాజు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన దాత, శ్రీలాశ్రిత ఆక్వాఫీడ్స్ యజమాని పేరిచర్ల రాంబాబు ఆర్థిక సాయంతో 132 మంది విద్యార్థులకు ఆర్టీసీ బస్ పాస్‌లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరి ఉమామహేశ్వరరావు, మానవత డైరెక్టర్ శ్రీకాకర్ల వినాయక్, మాజీ సర్పంచ్ ఇంటి చంటి, పేరిచర్ల పెద్దిరాజు, హెచ్‌ఎం బి.రాజేశ్వరి పాల్గొన్నారు.

బువ్వనపల్లి మాజీ సర్పంచ్ మృతి


సంకు వెంకట శేషగిరిరావు (ఫైల్)

నిడమర్రు: బువ్వనపల్లి మాజీ సర్పంచ్ సంకు వెంకట శేషగిరిరావు (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శేషగిరిరావు కుమారుడు, మాజీ ఎంపీటీసీ సంకు సత్యకుమార్ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా సేవలందిస్తున్నారు. బువ్వనపల్లి గ్రామ సర్పంచ్‌గా శేషగిరిరావు 1985 నుంచి 1992 వరకూ 7 సంవత్సరాలు గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన హయాంలో నాటి జెడ్పీ చైర్మన్ ఎర్రా నారాయణస్వామి సహకారంతో జిల్లాలో తొలి సారిగా చినకాపవరం పంట కాలువ నుంచి పైప్‌లైన్ నిర్మించి, బువ్వనపల్లి రక్షిత పథకానికి అనుసంధానించినట్లు గ్రామపెద్దలు చెబుతున్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై శేషగిరి మృతదేహానికి నివాళులర్పించారు.

ఫిజికల్ డైరెక్టర్ రాజాకు సత్కారం


మార్గాని రాజాను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: పీఈటీలు, పీడీలు గోపన్నపాలెం వ్యాయామ విద్యాకళాశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తమవంతు కృషి చేస్తామని సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు మార్గాని నర్సింహరాజా అన్నారు. కళాశాలలో పీడీలు, పీఈటీలు, కళాశాల సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు ఎంతో మంది దాతలు తమ వంతు ఏదో రూపంలో విరాళాలు ఇచ్చారని తాము కూడా ఈ కళాశాలకు అనతికాలంలోనే తమ వంతు సాయం అందిస్తామని రాజా అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు, డాక్టర్ ఎం.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నెఫ్రాలజిస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం


గోపన్నపాలెంలో నెఫ్రాలజిస్టు జి.శరత్‌బాబును సత్కరిస్తున్న బాలగణేష్ యూత్

దెందులూరు: ప్రముఖ నెఫ్రాలజిస్టు కోస్తా జిల్లాల్లో గ్రామశివారు ప్రాంతాల ప్రజలతో పాటు అందరికీ అందిస్తున్న వైద్యసేవలు స్ఫూర్తిదాయకమని గోపన్నపాలెం మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు అన్నారు. గురువారం బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో నెఫ్రాలజిస్టు శరత్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్‌లో గ్రామ శివారు ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లో వైద్యపరంగా అవగాహన సదస్సులు, వైద్యశిబిరాలు నిర్వహించాలని బాలగణేష్ యూత్ సభ్యులు శరత్‌ను కోరారు.

కిచెన్ గార్డెన్ కూరగాయలు అదరహో


కిచెన్ గార్డెన్‌లో పండించిన కూరగాయలు కోస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు: కైకరం హైస్కూల్‌లో హెచ్‌ఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో విన్నమైన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా విద్యార్థులచే కిచెన్ గార్డెన్‌లో పలు రకాల కూరగాయలు పండించారు. విద్యార్థులే వాటిని పండించి, కోసి మధ్యాహ్న వంటకాల్లో ఉపయోగిస్తున్నారు. విద్యార్థులను హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు.

అసైన్డ్ భూముల రీ వెరిఫికేషన్


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు వెరిఫికేషన్ చేస్తున్న జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ అద్దయ్య

దెందులూరు: అసైన్డ్ భూములు రీవెరిఫికేషన్‌ను ప్రారంభించామని జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ, రీ–వెరిఫికేషన్ దెందులూరు మండల కమిటీ చైర్మన్ కే.అద్దయ్య అన్నారు. గురువారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతి ఆధ్వర్యంలో దెందులూరు, పెదవేగి మండలాలకు సంబంధించి షరతులు కలిగిన పట్టాలు, అసైన్డ్ భూములతో పాటు అన్ని రకాల భూ రికార్డులను గ్రామాల వారీగా పరిశీలించారు. దెందులూరు మండలంలో 318 రికార్డులకు గానూ 296 ఎకరాల8 సెంట్లు భూమి ఉంది. వాటికి సంబంధించి297 మంది రైతులకు పట్టాలను ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములకు సంబంధించి 12 మంది రైతులు 6 ఎకరాల 84 సెంట్ల భూమికి సంబంధించి భూ–రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో దెందులూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, మండల రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు కిషోర్, కొవ్వలి వీఆర్‌ఓ రామకృష్ణ, దోసపాడు వీఆర్‌ఓ మద్దూరి సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి


కొవ్వలి ఉన్నత పాఠశాలలో ఆల్‌బెండజోల్ ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఇంటేటి మధులత

దెందులూరు: విద్యార్థులు నులిపురుగు నివారణకు శ్రద్ధ తీసుకోవాలని వైద్యశాఖ ఉచితంగా అందిస్తున్న ఆల్‌బెండోజోల్ టాబ్లెట్లను విధిగా వాడాలని కొవ్వలి సర్పంచ్ ఇంటేటి మధులత అన్నారు. గురువారం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శర్మ ఆధ్వర్యంలో వెయ్యి మంది పాఠశాల విద్యార్థులకు పోతునూరు పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఆల్‌బెండోజోల్ టాబ్లెట్ల ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతి

భీమడోలు: పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. భీమడోలులో గురువారం మండల పరిషత్ ఉద్యోగులు, వెలుగు ఉద్యోగులు, డ్వాక్రా మహిళలతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో చెత్తా చెదారాలను గుర్తించి వాటిని డంపింగ్‌యార్డ్ వద్దకు తరలించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పారిశుద్ధ్య పరిరక్షణకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు


పోతునూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ బోదుల స్వరూప్

దెందులూరు: మండలంలో గ్రామగ్రామాన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. గురువారం కొవ్వలిలో వేంకటేశ్వరస్వామి దేవాలయం వెనుక పారిశుద్ధ్య పనులు చేశారు. గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి రంగనాయకమ్మ పనులు చేయించారు. అలాగే పోతునూరులో గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, నాయకులు లక్ష్మణ్, కార్యదర్శి షరీఫ్, సచివాలయ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


సైకిల్ ర్యాలీలు చేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూర్జహాన్, తదితరులు

భీమడోలు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పూళ్ల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూర్జహాన్ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం పూళ్ల, ఎంఎంపురం, కురెళ్లగూడెం ఉన్నత పాఠశాలల్లోని కౌమార బాలికలకు పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో కలిసి సైకిల్ ర్యాలీ, ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నూర్జహాన్ మాట్లాడుతూ పౌష్టికాహారం ద్వారా రక్త హీనత వంటి వ్యాధుల నుంచి దూరమవుతారన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం యాప్‌లో అప్‌లోడ్


లబ్ధిదారుల ఇళ్ల ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్న హౌసింగ్ ఏఈ సురేష్‌బాబు

ఉంగుటూరు: బిల్లులు రాని ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. అలాంటివారు ఉంగుటూరు మండలంలో 759 మంది ఉన్నారు. వారి ఇళ్ల పొజిషన్ ఫొటో లబ్ధిదారుడి అకౌంటు నెంబరు తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేయమని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు హౌసింగు ఏఈ సురేష్ బాబు, సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుడిని తీసుకొని గ్రామాల్లో తిరిగారు. గురువారం ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, బొమ్మిడి, నాచుగుంట, యర్రమిల్లిపాడు, గొల్లగూడెం, తదితర గ్రామాల్లో తిరిగారు.

ఆరోగ్య నియమాలతో వ్యాధులకు దూరం


దోమల నివారణ రసాయనాలు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: సరైన ఆరోగ్య నియమాలు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని తాడేపల్లిగూడెం ఏరియా మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కాశిపాడు, చిలకంపాడు గ్రామాలలో ఆరోగ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛతా ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి


బాలికలకు కిట్లు పంచుతున్న దృశ్యం

ఉంగుటూరు: పరిశుభ్రత అవగాహన కార్యక్రమం గొల్లగూడెం హైస్కూలులో గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమెన్ ట్రస్టు డైరెక్టర్ ఇవాంజిలయన్ మాట్లాడుతూ యుక్త వయస్సులో ఉన్న బాలికల రుతుక్రమంపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించడం ఎంతో అవసరమని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు ఎం.పరమేశ్వరి, ఎం.చంద్రకళ మాట్లాడుతూ బాలికలు తీసుకోవల్సిన జాగ్రతలు తెలిపారు. ఉపాధ్యాయినులు అనురాధ, నయన తారలు మాట్లాడారు. ఆమెన్ ట్రస్టు వారు శానిటరీ నేప్‌కిన్స్ విద్యార్థినులకు పంచారు.

సామాన్యులు బతికేదెలా..?


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బలరాం

గణపవరం: కూరగాయలు, నూనెలు, నిత్యావసరసరకుల ధరలు చుక్కల్లో విహరిస్తుంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎలా బ్రతకాలో అర్థం కావడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం గణపవరం సీపీఎం కార్యాలయంలో చిన్నం చిననాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో ఏ వస్తువు ధర చూసినా ఏం కొనేట్టు లేదు, ఏం తినేట్టు లేదు అన్నట్లుగా ఉందన్నారు. ఇటీవలి భారీ వర్షాలు, వరదలకు ప్రతీ కుటుంబం ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, ఈ పరిస్థితిలో అన్ని రకాల ధరలూ పెరిగిపోయి వారిపరిస్థితి మరీ దిగజారిందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి పి.నర్సింహమూర్తి, ఎం.పెంటారావు, పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ భాస్కర్

ఉంగుటూరు: మండలంలోని ప్రభుత్వానికి సంబంధించిన 22ఎ రికార్డుల నుంచి తొలగించిన భూములను ఎవరికైనా పట్టాలు ఇచ్చారా, లేదా అని గురువారం డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ పరిశీలించారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను భాస్కర్ పరిశీలించారు. తల్లాపురంలో 10 పట్టాలు, తిమ్మయ్యపాలెంలో 32 పట్టాలు ఇచ్చినట్లు గుర్తించారు. అయితే అవేవీ రిజిస్టరు అవ్వలేనివిగా గుర్తించారు.

డిగ్రీ కాలేజిలో స్వచ్ఛతా కార్యక్రమాలు


గణపవరం డిగ్రీ కాలేజిలో స్వచ్ఛతా ర్యాలి చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గణపవరం: స్వచ్ఛతా కార్యక్రమాలను ప్రతీ ఒక్కరూ నిర్వహిస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకోవచ్చని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి అన్నారు. గురువారం కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో పరిశుభ్రతా కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ఆవరణలో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. కాలేజిలో ప్రతీ రోజూ ఒక్కో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి వెంకటరమణ తెలిపారు. ఇందు నిమిత్తం నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో గణపవరం డిగ్రీ కాలేజీ మాత్రమే ఎంపికై ందని, స్వచ్ఛతా కార్యక్రమాల అమలుకు రూ.25 వేల నగదు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ గేమ్స్ పోటీలు

భీమడోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20న శుక్రవారం ఉదయం 10 గంటలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తారని, మండల కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాలకు చెందిన బాలబాలికలు పోటీల్లో పాల్గొనాలన్నారు. అథ్లెటిక్స్, యోగా, చెస్, షటిల్ బాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తారన్నారు. మండల స్థాయిలో విజేతలైన బాలబాలికలను నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

స్థానికంగానే వైద్య సేవలు అందించాలి

ఏలూరు (టూటౌన్) : ఆర్గనైజింగ్ సెక్టార్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు ఈఎస్ఐ ద్వారా వైద్య సేవలను స్థానికంగానే అందించేలా చూడాలని ఏఐటీయూసీ నాయకులు కె.కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. ఏలూరు ఈఎస్ఐ డిస్పెన్సరీకి వచ్చే ఉద్యోగులు, కార్మికులను మెరుగైన వైద్య సేవల పేరుతో విజయవాడ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు. మెరుగైన వైద్య సేవల పేరుతో విజయవాడ రిఫర్ చేయడం సరికాదని పేర్కొన్నారు

పాము కాటుకు మహిళ మృతి

ఉంగుటూరు: పాము కాటుకు మహిళ మృతి చెందిన సంఘటన ఉంగుటూరులో గురువారం జరిగింది. వల్లూరి ధనలక్ష్మి (47) పాము కాటుకు గురై ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఉంగుటూరులో ధనలక్ష్మి వంటింట్లో వంట చేస్తున్న సమయంలో బుధవారం సాయంత్రం పాము కరిచింది. ఆమెను చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

పదోన్నతులు కల్పించాలి


ఏలూరు జిల్లా నూతన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

ఏలూరు టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆరోగ్య సంరక్షణకు విశేష సేవలందిస్తోన్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలని ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎస్ జయలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ ఎన్‌జీవో భవనంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యవర్గ సమావేశంలో ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.నాగమణి, ఉపాధ్యక్షురాలిగా కె.పద్మజ, ఎన్ రేణుక, కార్యదర్శిగా వీవీ నాగలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా టి.ధనలక్ష్మి, ట్రెజరర్ జె.మరియమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దవగల్ని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా ఎలాంటి పదోన్నతులు లేకుండా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగానే మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్లుగా పదోన్నతుల కల్పించేందుకు జీఓ 143ను అమలు చేయాలని కోరారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక పీహెచ్‌ఎన్‌ను నియమించాలన్నారు. నూతన అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ జీఓ 115 అమలు చేయాలని, ఏఎన్‌ఎం నుంచి శిక్షణ పొందిన వారిని వెనక్కి పంపటం సరికాదన్నారు. వారికి జీఎన్‌ఎం పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ఏఎన్‌ఎంలే కీలకమని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు ఎంవీ సావిత్రి, కార్యదర్శి కేఎస్ఎస్ కుమారి, జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన సంఘం కార్యకర్తలు ఉన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


విజయరాయి ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదవేగి: ఎవరైనా బాలలు ఆపదలో ఉంటె వెంటనే 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని డీసీపీయూ సునీత అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ అధికారి అయన సీహెచ్ సూర్య చక్రవేణి ఆధ్వర్యంలో పెదవేగి మండలం, విజయరాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట రమణ, సచివాలయం మహిళా కార్యదర్శి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వలిలో 23 నుంచి ఉపవాస ప్రార్థనలు

దెందులూరు: మండలంలోని కొవ్వలిలో బేతేలు సువార్త సహవాసం చర్చి ఫాస్టర్ విలియం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 29 వరకు ఉపవాస ప్రార్థన దీవెన పండుగలు జరుగుతాయని అన్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పండుగలు జరుగుతాయన్నారు. పది మంది సువార్తికులు వాఖ్యపరిచర్య నిమిత్తం ఆరు రోజులు పాటు అంబేడ్కర్ నగర్‌లో బేతేలు ప్రార్థనా మందిరానికి విచ్చేస్తారని సమీప మండలాల్లోని సభ్యులు దీవెన పండుగలకు హాజరుకావాలని విలియం కోరారు.